# అన్ని వర్గాల చూపు బీఆర్‌ఎస్ వైపే..

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పుశ్వంత్‌రెడ్డి



మంత్రి తలసాని సమక్షంలో పార్టీలో చేరిన ఏనుగు పుశ్వంత్‌రెడ్డి తదితరులు

బేగంపేట్, అక్టోబర్ 31: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల చూపు బీఆర్‌ఎస్ పార్టీ వైపే ఉందని సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద పద్మారావునగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పీసీసీ సెక్రటరీ, హైదరాబాద్ సిటీ జనరల్ సెక్రటరీ ఏనుగు పుశ్వంత్‌రెడ్డి మంత్రి తలసాని సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి తలసాని ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నంత కాలం అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం చేసిందన్నారు. మళ్లీ ఇప్పుడు ఒక్క ఛాన్స్ అంటూ వస్తున్నారని విమర్శించారు. మోసకారి కాంగ్రెస్ పార్టీని ప్రజలెవరూ నమ్మడం లేదన్నారు. అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న కేసీఆర్ నాయకత్వాన్ని, తెలంగాణ ప్రభుత్వానికే మద్దతు తెలుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పవన్‌కుమార్‌గౌడ్, బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, జనరల్ సెక్రటరీ మహేందర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

❖ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని బీఆర్‌ఎస్ పార్టీ సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మంగళవారం తలసాని శ్రీనివాస్ యాదవ్ బేగంపేట్ డివిజలోని పాటిగడ్డ, ఎన్‌బీటీ నగర్, వడ్డెరబస్తీ, గౌతమ్‌నగర్, ఓల్డ్ పాటిగడ్డ,నూర్‌బాగ్ ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముందుగా ఎన్‌బీటీనగర్‌లో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రచారరథాన్ని ప్రారంభించి పావురాలను ఎగురవేశారు. కుంకుమ తిలకం దిద్ది మంగళ హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. దీంతోపాటు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగుల పుశ్వంత్‌రెడ్డి మంత్రి తలసాని సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా.. ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీకి బిగ్ షాక్

బీఆర్‌ఎస్‌లో చేరిన తిరుపతి



ఏనుగుల తిరుపతికి బీఆర్‌ఎస్ కండువా కప్పిన మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్

బాలానగర్, అక్టోబర్ 31 : కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిగా గత ఎన్నికల్లో పోటీ చేసిన ఏనుగుల తిరుపతి మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. దీంతో ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో బీజేపీ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలినట్లైంది. మంత్రి కేటీఆర్ తిరుపతికి బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీ మేడ్చల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడిగా కూడా ఏనుగుల తిరుపతి పని చేశారు. తిరుపతి 2019 నుంచి బీజేపీలో చేరి ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి ముద్దం నర్సింహయాదవ్ చేతిలో పరాజయం పాలయ్యారు. తిరుపతి బీఆర్‌ఎస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్‌కు కొంత బలం చేకూరినట్లు అయింది.

## బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు,
బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్




గాజులరామారం ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

జీడిమెట్ల, అక్టోబర్ 31: బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి శంభీపూర్ రాజు, బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ పిలుపునిచ్చారు. మంగళవారం గాజులరామారంలోని విన్ ప్యాలెస్‌లో జరిగిన గాజులరామారం డివిజన్ ప్రజా ఆశీర్వాద సభకు డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు విజయ రామిరెడ్డి అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆరు వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. బస్తీల్లో కాలనీవాసులు ఏకగ్రీవంగా బీఆర్‌ఎస్ పార్టీకే మద్దతు తెలుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, సీనియర్ నాయకులు రషీద్ బేగ్, కస్తూరి బాలరాజు, కమాలాకర్, శ్రీనివాస్ యాదవ్, నవాబ్, హుస్సేన్, సింగారం మల్లేశ్, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీలు చేసిందేమీ లేదు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అల్లాపూర్, అక్టోబర్ 31 : కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని, ఆ రెండు పార్టీలతో రాష్ట్రానికి చేటు అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని చంద్ర గార్డెన్స్‌లో డివిజన్ కార్పొరేటర్ సబీహాబేగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ఆత్మీయ, బూత్ స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొమ్మిదేండ్ల కిందట అల్లాపూర్‌లో వేసిన మట్టి రోడ్లు, మ్యాన్ హోల్స్ పొంగి మురుగునీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగు నీరు అందక ఇబ్బందులు పడ్డారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ మంత్రి కేసీఆర్ సహకారంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ రిజర్వాయర్ నిర్మించి ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామన్నారు. కూకట్‌పల్లి నుంచి మూడోసారి బరిలో ఉన్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నమ్మొద్దన్నారు. మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, లింగాల ఐలయ్య, పిల్లి తిరుపతి, వీరారెడ్డి, రహీమ్, జహెద్ షరీఫ్ బాబా, పార్వతమ్మ, పుష్పలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : అభ్యర్థి మర్రి



మల్కాజిగిరిలో పాదయాత్ర చేస్తూ
ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, అక్టోబర్ 31: మల్కాజిగిరి నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరి, అల్వాల్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, గౌతంనగర్, నేరేడ్‌మెట్, వెంకటాపురం డివిజన్‌లలో అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఇంటింటి పాదయాత్ర చేసి సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలోని అన్ని పథకాలను ప్రజలకు అందజేస్తామన్నారు. ఇప్పటికే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. విడతల వారికిగా పింఛన్లు పెంచుతామన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పేదలకు డబుల్ బెడ్‌రూంలు ఇచ్చామని, ఎన్నికల తర్వాత మల్కాజిగిరి నియోజకవర్గానికి ఐదు వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మీనాఉపేందర్ రెడ్డి, సబితాకిశోర్, సునీతారాము యాదవ్, శాంతిశ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, ఆకుల నర్సింగరావు, జేఏసీ వెంకన్న, అనిల్‌కిశోర్, రాము యాదవ్, ఉపేందర్ రెడ్డి, అమీనుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు మద్దతుగా..బీఆర్‌ఎస్‌లో చేరిక



నార్సింగిలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు, నాయకులు

మణికొండ, అక్టోబర్ 31: కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు చెందిన నార్సింగి, కోకాపేట గ్రామాల యువ నాయకులు ఏకగ్రీవంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు మద్దతు పలుకుతూ మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్ యాదవ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతూ, ప్రజల మధ్యనే ఉండే నాయకుడు ప్రకాశ్‌గౌడ్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ, మద్దతు లభించడం చూస్తుంటే ఆయన లక్ష ఓట్ల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వెంకటేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం హయాంలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలతో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు మహమూద్, వక్ఫ్‌బోర్డు సభ్యుడు నిజాముద్దీన్, పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్, ఎంఐఎం ప్రధాన నాయకులు మెహ్మద్ ఇక్బాల్, మొయిన్, భాస్కర్‌రెడ్డి, ఎజాజ్, మహ్మద్ మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

## గోషామహల్‌లో ఘన విజయం సాధిస్తాం

నందకిశోర్ వ్యాస్ బిలాల్



పీల్‌ఖానాలో పర్యటిస్తున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్ తదితరులు

అబిడ్స్, అక్టోబర్ 31: గోషామహల్ నియోజకవర్గం ప్రజల సహకారంతో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. పీల్‌ఖానా ప్రాంతానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా.. బిలాల్ వారికి పార్టీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలను నియోజకవర్గంలోని ఇంటింటా ప్రచారం చేసి ప్రజల మద్దతు కూడగట్టి ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ముక్రముద్దీన్, సయ్యద్ ఫహీం, ముస్తఫా మొహియుద్దీన్, మహ్మద్ అన్వర్, అజహర్ షేక్, మహ్మద్‌అఖిల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ వెంటే ప్రజలు : ఎమ్మెల్యే కాలేరు



గోల్నాక వడ్డెరబస్తీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, అక్టోబర్ 31 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజాదరణ ఉన్నదని, ప్రజల మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉందని పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. మంగళవారం ఆయన నియోజకవర్గంలోని గోల్నాక, వడ్డెరబస్తీ, అన్నపూర్ణనగర్, లాల్‌బాగ్ తదితర ప్రాంతాల్లో తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా బస్తీల్లో ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఏ బస్తీకి వెళ్లినా మహిళలు కాలేరుకు హారతులు పట్టి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతల కల్లిబొల్లి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, ప్రజాసంక్షేమం కోసం పనిచేసే బీఆర్‌ఎస్‌ను ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.